నోరూరించే నేరేడు పండ్లు

- పండ్లకు కేరాఫ్ మంగాపురం, కొత్తగూడెం రోడ్డు
- ఆరోగ్యానికి ఎంతో మేలు
- సీజన్ వచ్చింది.. రుచి చూడండి

తల్లాడ: వాటిని చూడగానే నోరూరిపోతుంది. తినాలనిపిస్తుంది. నిగనిగలాడే నేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటినే గిన్నె పండ్లు(నేరేడు) అంటారు. తల్లాడ మండలం మంగాపురం గ్రామం వెళ్లే రోడ్డులో, తల్లాడ నుంచి కొత్తగూడెం వెళ్లే ప్రధాన రహదారిలో నేరేడు వృక్షాలు ఉంటాయి. ప్రతి ఏటా జూలై, ఆగస్టు నెల సీజన్‌లో ఇవి కాయలు కాస్తాయి. పెద్ద వృక్షాలు కావడంతో వాటి పండ్లను గడతోనో, లేదా చెట్టెక్కి కోసుకుంటారు. గాలి వచ్చినప్పుడు పండ్లు రాలి నేలమీద పడతాయి. పక్షులు, కోతులు వచ్చి ఈ చెట్లపై కూర్చొని కొన్ని పండ్లను తిని, కొన్నింటిని కింద పడేస్తుంటాయి. చెట్లపైకి ఎక్కి పిల్లలు నేరేడు పండ్లను కోసుకుంటారు. వాటిని జేబు ఖర్చులకోసం ఆ దారిన వెళ్లే వారికి విక్రయిస్తారు. వాహనాలపై వేళ్లే వారు కూడా ఆగి మరి వాటిని తింటుంటారు. ఇక పిల్లలు వాటిని మరింత ఇష్టపడతారు.

మంగాపురం, కొత్తగూడెం రోడ్డులో..

నేరేడు చెట్లు(గిన్నె) తల్లాడ నుంచి మంగాపురం వెళ్లే రోడ్డు, తల్లాడ నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డులో ఉన్నాయి. రోడ్డు కిరువైపులా ఈ చెట్లు పెరిగాయి. ఇవి నీడనివ్వటంతో పాటు పండ్లను ఇస్తాయి. సుమారు 100 చెట్లు వరకు ఉన్నాయి. పాదాచారులకు, బాటసారులకు, చల్లటి నీడనివ్వటంతో పాటు పండ్లను ఇస్తున్నాయి.

నేరేడులో ఔషధ గుణాలు..

జిగట విరేచనాలతో బాధ పడేవారికి నేరేడు పండ్ల రసాన్ని రెండు నుంచి మూడు చెంచాల చొప్పున ఇవ్వాలి. రోగికి శక్తితోపాటు పేగుల కదలికలు నియంత్రణలో ఉంటాయి. కాలేయం పని తీరు క్రమబద్ధీకరిండానికి, శుభ్ర పర్చడానికి నేరేడు దివ్య ఔషదంలా పనిచేస్తుంది. ఈ పండులోని యాంటీ ఆక్సిడెంట్లు మెదడుకు గుండెకు ఔషదంగా పనిచేస్తాయి.


గుత్తులుగా కాచిన నేరేడు చెట్టు


పక్వానికి వచ్చిన గిన్నె పండ్లు

సండే స్పెషల్

జ్వరంగా ఉన్నప్పుడు దనియాల రసంలో నేరేడు రసం కలిపి తీసుకుంటే.. శరీర తాపం తగ్గుతుంది. మూత్రం మంట తగ్గడానికి నిమ్మరసం, నేరేడు రసం రెండు చెంచాల చొప్పున నీళ్లలో కలిపి తీసుకోవాలి. పిండి పదార్థాలు, కొవ్వు భయం ఉండదు కాబట్టి అధిక బరువు ఉన్నవారు, మధుమేహం రోగులు సైతం వీటిని రోజుకు ఆరు నుంచి ఎనిమిది దాకా తినవచ్చు.

ఆకులు, బెరడు వల్ల ఉపయోగాలు..

నేరేడు చెట్టు ఆకులు, బెరడు గింజలు కూడా మేలు చేస్తాయి. ఆకులతో కషాయం చేస్తే బ్యాక్టీరియల్, వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. ఆకులను దంచి కషాయంగా కాచి పుక్కిలిస్తే దంతాలు కదలడం, చిగుళ్ల వాపులు, పుండ్లు వంటివి త్వరగా తగ్గుతాయి. ఆకులను నమిలి నీళ్లతో పుక్కిలించి ఉమ్మి వేస్తుంటే.. నోటి దుర్వాసన తగ్గుతుంది. ఆకు రసంలో పసుపు కలిపి పురుగులు కుట్టిన చోట, దురదలు, సాధారణ దద్దుర్లకు లేపనంగా రాస్తుంటే ఉపశమనం లభిస్తుంది. నెలసరి సమస్యలకు నేరేడు చెక్క కషాయాన్ని25 రోజులపాటు 30 ఎంఎల్ చొప్పున రోజుకు రెండుసార్లు తీసుకోవాలి. నోట్లో పుండ్లు, చిగుళ్ల సమస్యలకు దీని కషాయం పుక్కిలిస్తే మార్పు ఉంటుంది. చెట్టు బెరడులో మరియు విత్తనాలలో 13నుంచి 19 శాతం వరకు టాన్నిన్లు ఉంటాయి. విత్తనం నుంచి తీసిన రసం అధిక రక్తపోటును నయంచేస్తుంది. మదుమేహానికి కూడా పని చేస్తుంది. కాలేయం పని తీరును మెరుగు పర్చడంలో వీటిలో ఉండే యాంటాక్సిడెంట్లు కీలకంగా పని చేస్తాయి. రక్తకేన్సర్, కారకాలను నిరోదిస్తాయి. శరీరంలోని ఎర్ర రక్తకణాలను వృద్ధి చేస్తుంది. అనీమియా(రక్తహీనత) తగ్గుతుంది. ఎముకలకు పుష్టిని ఇస్తుంది. గుండె వ్యాధులను నివారిస్తుంది.

ఏటా గిన్నెపండ్లు వస్తాయి..



ప్రతి ఏటా సీజన్‌లో మాకు గిన్నె చెట్లు పండ్లనిస్తాయి. వేసవికాలంలో ఈ చెట్లు రహదారుల వెంట వచ్చే పోయే వారికి నీడనిస్తుండటంతో పాటు వర్షాకాలంలో నేరేడు పండ్లను అందిస్తున్నాయి. రెండు నెలల పాటు ఈ గిన్నె పండ్లు కాస్తుంటాయి. ప్రతి ఏటా మాకు ఇవి దివ్య ఔషదంలా ఉపయోగపడుతున్నాయి.

– దుగ్గిదేవర రమేష్, మంగాపురం

ఆరోగ్యానికి మంచిది..



మంగాపురం, కొత్తగూడెం రోడ్లలో ఈ నేరేడు చెట్లు రెండు వైపులా ఉన్నాయి. ఇవి ఈ సీజన్‌లో విపరీతంగా కాయలు కాస్తుంటాయి. వాటిని గడలతో రాలగొట్టి రుచి చూస్తుంటాం. పుల్లగా, తియ్యగా ఉండే ఈ పండ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. స్థానికులకే కాక ఈ రోడ్డున పోయే వారు వీటిని రుచి చూస్తుంటారు.

– దుగ్గిదేవర చందర్‌రావు, మల్లవరం

జ్వరాల వ్యాప్తి.. జాగ్రత్తలు

వైరా పీహెచ్‌సీ డాక్టర్‌తో నేడు ఫోన్ ఇన్


డాక్టర్ ఉదయలక్ష్మి

సాక్షి ఫోన్ ఇన్

వైరా: వైరాతో పరిసర గ్రామాల ప్రజలు డెంగీ, చికున్ గున్యా, వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఈ జ్వరాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు 'సాక్షి' ముందుకొచ్చింది. ఈ మేరకు ఆదివారం 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. జ్వరాల నివారణకు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తాత ఉదయలక్ష్మి ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తారు.

తేదీ : 25-08-2024, ఆదివారం
సమయం :
ఉదయం 10 నుంచి 11గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ :
77805 76728

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోండి


మాట్లాడుతున్న ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం కోర్టుల పరిధి పనితీరు అధికారం అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో రకాలు, వాటి పరిధిలను వివరించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆడమ్స్, సెక్రటరీ రమేష్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, న్యాయవాదులు మహేంద్ర, అరుణ, సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చింతకాని ఎంపీఓ బదిలీ

చింతకాని: చింతకాని మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్‌ను డిప్యూటేషన్‌పై జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి కేటాయించారు. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, చింతకాని ఎంపీఓగా వందనం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుకు తాత్కాలికంగా బాధ్యతలుఅప్పగించారు.

మొబైల్‌యాప్ ద్వారా కుటుంబ నిర్ధారణ

చింతకాని: వ్యవసాయ పంట రుణాలు రూ.2 లక్షల లోపు ఉండి రుణమాఫీ కాని రైతుల కుటుంబ వివరాలను ట్రయల్ వెర్షన్‌గా మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఏఓ పల్లెల నాగయ్య తెలిపారు. చింతకానిలో శనివారం మొబైల్ యాప్‌లో రైతుల వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ వివరాల నిర్ధారణకు సంబంధించిన ప్రత్యేక యాప్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నమోదు చేయనున్నట్లు తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలి

కొణిజర్ల: రైతులు పండించిన పెసర పంటను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సోమయ్య, ఆదిరెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ముగ్గురి వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్‌మియా అన్న జానిమియా కోడలు మాధురిని పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని చాంద్‌మియా, అతని కుమారుడు సమద్, కుమారుడి అల్లుడు చాంద్ పాషా ముగ్గురు కలిసి గొడవ పెట్టుకుని కొడుతుండగా అడ్డుగా వెళ్లిన మాధురి మామ జానిమియా, భర్త ఇబ్రహీంలను కూడా కొట్టడంతో తీవ్ర గాయాలైనాయి. మాధురి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై వెంకటేశ్వర్లు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

ఎర్రుపాలెం: మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి మందడపు రామ్‌ప్రదీప్ నోట్ పుస్తకాలు అందించారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వేంసూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదవాలని ఎమ్మెల్యే మట్టా రాగమయి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండగట్ల ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భోదన తీరును, రికార్డులను పరిశీలించారు. దవఖానాలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, సీతారెడ్డి, ఆమాచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

కల్లూరు: కల్లూరు పట్టణంలోని అనారోగ్యంతో మృతి చెందిన అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఉబ్బన రంగమ్మ మృతదేహాన్ని, పల్లయ్య బంజర్‌రోడ్‌లో కృష్ణ మృతదేహాలను ఎమ్మెల్యే రాగమయి సందర్శించి పూలమాలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి, ప్రభాకర్, నరసింహారావు, నగేష్, రామకృష్ణ, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

బోనకల్: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయాధికారి కే.విజయబాస్కర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని 22 గ్రామాలకు సంబంధించిన 75శాతం రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రసాద్, కొండ, పారా ప్రసాద్, పుల్లయ్య, శ్రీను, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తూరు రైతు వేదిక వద్ద..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరు రైతు వేదిక వద్ద సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం వ్యవసాయాధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి రావుల రాజబాబు, నాయకులు పాండు, శ్రీను, సర్వేశ్వరరావు, బుచ్చయ్య, సత్యనారాయణ, నాగలక్ష్మి, రమణ పాల్గొన్నారు. అదేవిధంగా ఏఐకేఎంఎస్ ఆధ్వర్యాన రైతులకు రుణాలు వెంటనే మాఫీ చేయాలని కోరుతూ ఏఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, ఆదినారాయణ, మారుతి, రాఘవులు, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: కొత్తూరు రైతువేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పెనుబల్లి: షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సేలం సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. పెనుబల్లి రైతు వేదిక ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్‌రావు, వ్య.కా.సా జిల్లా కమిటీ సభ్యులు తిరుపతిరావు, మండల కార్యదర్శులు నరసింహారావు, రాజారావు, అరుణ్ ప్రతాప్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దీపికలకు అవగాహన

తల్లాడ: తల్లాడ యూనియన్ బ్యాంక్, సెర్ప్ ఆధ్వర్యంలో శనివారం గ్రామ దీపికలు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, బ్యాంక్ అనుసందానంపై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు అందించే రుణాలను వివరించారు. ఈ సందర్భంగా మహిళా శక్తిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉప రీజనల్ హెడ్ సుదాకర్, ఏపీఎం చిన్న వెంకటేశ్వర్లు, తల్లాడ బ్రాంచి మేనేజర్ వి.రాజశేఖరెడ్డి, బ్యాంక్ సిబ్బంది, సీసీలు, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

డైరెక్టర్‌కు సన్మానం

వైరా: జాతీయ లేబర్ కోఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఖమ్మం పట్టణ కేంద్రానికి చెందిన డీసీఎంఎస్ డైరెక్టర్ కుంచెపు వెంకటేశ్వర్లు శనివారం వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిప్ చైర్మన్ కుంచెపును శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రామారావు, తిరుపతిరావు, రాము పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామానికి చెందిన రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం అంబటి శాంతయ్యను పీఆర్‌టీయూ జిల్లా నాయకులు శనివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా శేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, మండల మాజీ అధ్యక్షులు రమణారావు, రహీముద్దీన్, మండల ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణారావు, సురేష్ కుమార్, వెంకన్న, నోబెల్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

పెనుబల్లి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. పెనుబల్లి అంగన్‌వాడీ కేంద్రం-4 లో శనివారం ఈసీసీఈ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణకుమారి, పద్మరాజకుమారి, రాజేశ్వరి, లూర్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

పెనుబల్లి: మండల పరిధిలోని గంగదేవిపాడులో లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బందితో నీరు నిల్వ ఉన్న మురికి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించడం, బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో లంకాసాగర్ పీహెచ్‌సీ సిబ్బంది నాగేశ్వరరావు, పుల్లమ్మ, సుజనా, హెల్త్ అసిస్టెంట్ కరీముల్లా, ఏఎస్‌ఎం రమాదేవి, పంచాయతీ సిబ్బంది చెన్నారావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మల్లు నందినికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

బోనకల్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందినికి బోనకల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీకు స్థలాలు, ఇళ్లు ఇచ్చేలా.. డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురబి వెంకన్న, యార్లగడ్డ శ్రీను, తేనె వెంకటేశ్వర్లు, తమ్మారపు వెంకటేశ్వర్లు, ఆకెన పవన్, రేగళ్ల శ్రీను, యార్లగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: తిరుమల శ్రీవారిని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కుమారులు భార్గవ్, తేజలతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందించారు. శ్రీవారి శేష పట్టు వస్త్రాలను ఆలయ అధికారులు అందించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

జిల్లా కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయండి

కల్లూరు: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 26న ఖమ్మంలో ఉదయం 9:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు అన్నారు. శనివారం కల్లూరులో నిర్వహించిన మండల కమిటీ సభ్యుల సమావేశంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడల అంజయ్య హాజరవుతారని, ఎలక్ట్రీషియన్ల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హర్షిమ్ షరీఫ్, కల్లూరు మండలాధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు కరుణాకర్, ప్రచార కార్యదర్శి రవి, సహాయ కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు చేయడం సరికాదు

తల్లాడ: కాంగ్రెస్ ప్రభుత్వంపైన మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య విమర్శలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం తల్లాడ జీఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ మండలస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. రుణమాఫీ విషయంలో సండ్ర అబద్ధపు ప్రచారం చేస్తున్నారని.. రుణమాఫీ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని అర్హులైన రైతులందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. అనవసరంగా కాంగ్రెస్‌పై బురద చల్లాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నరసింహారావు, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

దాతల చేయూత అభినందనీయం


మధిర: చిలుకూరులో విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న మల్లు నందిని


మధిరరూరల్: విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మల్లు నందిని

మధిర/మధిరరూరల్: గ్రామాల అభివృద్ధితో పాటు విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తిచేసేలా దాతలు చేయూతనివ్వడం అభినందనీయమని అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క పేర్కొన్నారు. మధిర మండలం చిలుకూరులో యూఎస్‌ఏకు విద్యార్థులకు ఫార్చ్యూన్ ఫండ్, ఎస్2 టెక్ సెయింట్ లూయిస్ ఆధ్వర్యాన రూ.3.50 లక్షల విలువ చేసే 24 సైకిళ్లను మాజీ సర్పంచ్ నిడమానూరు సంధ్య వంశీకృష్ణ నేతృత్వంలోశనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లు నందిని మాట్లాడుతూ గ్రామానికి సేవ చేయాలనే తపనతో పని చేస్తున్న సంధ్య వంశీకృష్ణ అభినందనీయులన్నారు. దాతలు, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, కౌన్సిలర్ కోనా ధనికుమార్, నాయకులు దారా బాలరాజు, అద్దంకి రవికుమార్, పాటిబండ్ల సత్యంబాబు, తూమాటి నవీన్‌రెడ్డి, దుంపా వెంకటేశ్వరరెడ్డి, రంగా హన్మంతరావు ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల పాల్గొన్నారు. అలాగే, మధిరలోని ప్రభుత్వ బాలికల బీసీ గురుకుల కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యాన చైర్మన్ నందిని ల్యాప్‌టాప్‌లు అందజేశాక కౌన్సిలర్ మల్లాది వాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు శిరీష, సుష్మ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలతతో పాటు సౌజన్య, సూరంశెట్టి కిషోర్, శీలం వెంకటరెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాల రమణగుప్తా, వై.అనిల్‌కుమార్ నెహ్రూ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు..

బోనకల్: మండలంలోని 20మంది దివ్యాంగులకు అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని శనివారం బోనకల్‌లో ట్రై సైకిళ్లు అందజేశారు. నాయకులు పైడిపల్లి కిశోర్, బందం నాగేశ్వరావు, దుర్గారావు, కర్నాటి కోటి, పిల్లలమర్రి నాగేశ్వరావు, సుబ్బారావు, సైదానాయక్, బీపీ.నాయక్, గత్తం బాలరాజు, రమేష్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, సౌజన్య, రమ, ప్రమీల, ప్రగతి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్

వైరా: వైరాలోని ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలోని క్రాంతి జూనియర్ కళాశాలలో శనివారం ఓపెన్ స్కూల్ వాల్ పోస్టర్లను మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆవిష్కరించారు. 2024–25 ఏడాదికి ఓపెన్ ఇంటర్మీడియట్ విద్యాభ్యసించేందుకు ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ తెలిపారు. చదువు మధ్యలో మానేసిన మహిళలు, వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని సూచించారు. ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ కోసం 9440504644, 9014584714, 9948707632, 6281106157 నంబర్లకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోర్డినేటర్ కృష్ణారావు, పాదిలి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యానికేతన్‌లో..

కల్లూరు: ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల డ్రైవ్‌లో భాగంగా శనివారం స్థానిక విజ్ఞాన్ విద్యానికేతన్‌లో ఎంఈఓ దామోదర ప్రసాద్ చేతుల మీదుగా తెలంగాణ ఓపెన్ స్కూల్ వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటుగా ఏఐ కోఆర్డినేటర్ ఎస్‌కే.ఇస్మాయిల్‌లు.. ఓపెన్ స్కూల్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఆసక్తి కల విద్యార్థులు 9985835115, 7416812820 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం మహళల రక్షణ సాధికారితపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి అధ్యక్షతన మహిళా సాధికారత టీమ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో సఖీ ఖమ్మం కోఆర్డినేటర్లు ఎస్‌డీ సమ్రీన్, ప్రమీల, సరితలు వివిధ చట్టాలపై అవగాహన కలిపిస్తూ హెల్ప్‌లైన్ నంబర్లు వివరించారు. అనంతరం ఇటీవల కోల్‌కతాలో హత్యాచారానికి గురైన జూనియర్ డాక్టర్ మౌమితకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సఖి సభ్యులు

ఔషధ మొక్కలు నాటిన విద్యార్థినులు..

కళాశాల వృక్షశాస్త్ర విభాగం వారి ఆధ్వర్యంలో విద్యార్థినులు పలు రకాల ఔషధ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ నవ్య సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

ముదిగొండ: ముదిగొండ ప్రధాన సెంటర్‌లో ముదిగొండ ఖమ్మం రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. గుంతల్లో స్థానికులు ఓకర్రను ఏర్పాటు చేసి దానిపై బస్తాను ఉంచారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు స్పందించిన అధికారులు శనివారం రహదారిపై ఉన్న గుంతలను పూడ్చివేశారు.

మల్సూర్‌తండా వద్ద..

తల్లాడ: జాతీయ రహదారిలో మల్సూర్‌తండా - రంగంబంజర సమీపంలో రోడ్డు ఉబ్బి ప్రమాదకరంగా తయారైంది. దీంతో ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని మల్సూర్‌తండాకు చెందిన హెల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దర్మసోత్ ధశరద్‌నాయక్, నూతనకల్‌కు చెందిన వరికొల్లి రమేష్ సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయిని కోరగా.. ఆమె చొరవతో ఆర్ అండ్‌బీ సిబ్బంది శనివారం జేసీబీతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు.


మల్సూర్‌తండా వద్ద మరమ్మతులు చేసిన దృశ్యం

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


మధిర: శ్రీ కృష్ణ, గోపికల వేషధారణలో ఉన్న విద్యార్థులతో వెంకటరెడ్డి, విద్యాలత దంపతులు

మధిర: మధిర పట్టణంలో ఉన్న భరత విద్యాసంస్థల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, డైరెక్టర్ శీలం విద్యాలత దంపతులు పాల్గొని రాధాకృష్ణుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో చూపరులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. అనంతరం వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు, ఉమ, డీన్ రవీందర్ రెడ్డి, స్రవంతి, నాగరాజు, పాషా, అజీమ్, భవాని, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థల్లో..

స్థానిక నారాయణ బెస్ట్ ఫౌండేషన్ విద్యాసంస్థల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బోనగిరి నారాయణరావు, వనజ దంపతులు సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

బాలభారతి విద్యాలయంలో..


తల్లాడ బాలభారతి విద్యాలయంలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

తల్లాడ: స్థానిక బాలభారతి విద్యాలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని విద్యార్థులు ఉట్టే కొట్టే కార్యక్రమం నిర్వహించి.. నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపాల్ రామారావు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేపీఆర్ గౌతమ్ స్కూల్‌లో..

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని కేపీఆర్ గౌతమ్ స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరు ప్రతిభ విద్యాలయంలో..

కల్లూరు: కృష్ణాష్టమిని పురస్కరించుకుని కల్లూరు ప్రతిభ విద్యాలయంలో విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యాసంస్థల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.